02ATP27_02ATP27.qxd 17-05-2025 PM 10:36 Page 1



## శోభాయాత్రను విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

హిందూపురం మే 17 ప్రభాతవార్త

ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హిందూ సురక్ష సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా 22వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ సుగురు ఆంజనేయస్వామి ఆలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుగురు ఆలయం నుండి ప్రారంభమై మోడల్ కాలనీలోని వ్యాసరస ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ముగుస్తుంది అన్నారు అనంతరం ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తాదులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హిందూపురం పరిసర ప్రాంతాలలోని హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో రమేష్ రెడ్డి, చారుకీర్తి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

హిందూపురం టౌన్ మే 17 ప్రభాతవార్త



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

వేసవికాలంలో హిందూపురం పట్టణ ప్రజలు ఆరోగ్యంపై దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి.ఇ రమేష్ కుమార్ సూచించారు. శనివారం హిందూపురం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర హిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి నుండి గాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించారు. సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఎండాకాలంలో ఎక్కువ నీటిని తాగాలని సూర్యకిరణాల మీద పడకుండా గొడుగులు ఉపయోగించాలని చక్కెర పానీయాలు నివారించాలని నీడలో విశ్రాంతి తీసుకోవడం మంచిదని సూచించారు. అదేవిధంగా పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని ఆపాలని ప్లాస్టిక్ వాడకం వలన మన భూమి కాలుష్యం అవుతుందని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు దుర్గా నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తాం

**సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్**



శ్రీరామ్ రెడ్డిపంప్ హౌస్ వద్ద 42వ రోజు సమ్మె చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ 17 మే ప్రభాతవార్త

కళ్యాణదుర్గం పట్టణంలోస్థానిక శ్రీరామిరెడ్డి పంప్ హౌస్ వద్ద కార్మికుల సమ్మె 42వ కొనసాగుతుంది..పంప్ హౌస్ ముందు జీతాలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సిఐటియూ నాయకులు, కార్మికులు నినాదాలు చేశారు..ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి త్రాగునీటి కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాల కోసఖ సమ్మె బాట పట్టారు. అయితే దాదాపు 40 రోజుల పాటు సమ్మె చెస్తే కేవలం కొందరికి మాత్రమే రెండు,మూడు నెలల వేతనాలు ఇచ్చి అందులోను ఒక్కొక్కరికి 2000 వేల వరకు కోతలు విధించారు...30 నెలల పిఎఫ్ గురించి మాట్లాడం కూడా లేదు అందుకు నేడు కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తే అందరూ మాకు పెండింగ్లో ఉన్న వేతనాలు,పిఎఫ్ చెల్లించే వరకు సమ్మె కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. అందుకు కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు చెల్లించేత వరకు సమ్మె కొనసాగిస్తామని వారు తెలిపారు...కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి యూనియన్ కార్మికులు ప్రభాకర్, వన్నూరుస్వామి, నరేష్,బాషా పాల్గొన్నారు.

## దేశ భద్రత సమగ్రత కోసం మనమంతా సమైక్యంగా కదులుదాం...

**మొదటిపేజి తరువాయి...** ప్రాణాలను ఎదురొడ్డి పోరాడుతున్న మన సైనికులు అందరికీ మన మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని, ఇవాళ మన దేశంలో ప్రతి ఒక్క పౌరుడు రాజకీయాలకతీతంగా, మతాలకతీతంగా జరుగుతున్న తిరంగాయాత్రలో జాతీయపతాకాన్ని భుజానవేసుకుని సైనికులు అండగా నిలబడడం, మన ప్రధానకర్తవ్యమనితెలిపారు. విభిన్న సంస్కృతులు మనదేశం ఉన్నదనితెలిపారు. అనంతరం ఎస్పీమాట్లాడుతూ సైనికులకు వారి కుటుంబాలను వారి ఊరుని వదిలి అనేక ప్రతికూల పరిస్థితుల్లో సరిహద్దుల్లో మనమంతా సురక్షితంగా ఉండాలని ప్రాణాలను ఎదురొడ్డి పోరాడుతున్న మన సైనికులు అందరికీ మన మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశ భద్రత విషయాల్లో రాజీ పడబోమనే ఉద్దేశ్యాన్ని ఇతర దేశాలకు ఒక హెచ్చరికను మన సైనికులు చూపిన పోరట పటిమే ఇందుకు నిదర్శనం అన్నారు. పుట్టపర్తి పురవీధుల్లో ప్రతి ఒక్కరూ జాతీయ జెండాల పట్టుకుని వందే మాతరం అంటూ నినాదాలు చేశారు. అనంతరం జాతీయ గీతాలాపన గావించి జెండా వందనం చేశారు.

**దేశ భద్రత విషయంలో మన సైనికుల పాత్ర అమోఘం.**

**- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

తిరంగ యాత్ర ర్యాలీ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ తో మన ఇండియన్ ఆర్మీ శక్తి ఏంటో ప్రపంచానికి చాటమన్నారు. ప్రతి భారతీయుడు ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తూ మన కేంద్ర ప్రభుత్వానికి, మన దేశ సైనికులకు మద్దతుగా యావత్ భారత్ నిలిచిందని గుర్తు చేశారు. త్రివిధ దళాలకు మద్దతుగా ఈ తిరంగా ర్యాలిని నిర్వహించినట్లుఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మన దేశ భద్రత విషయాల్లో రాజీ పడబోమనే ఉద్దేశ్యాన్ని ఇతర దేశాలకు ఒక హెచ్చరికను మన సైనికులు చూపిన పోరాట పటిమే ఇందుకు నిదర్శనం అన్నారు. పహల్గాం లాంటి సంఘటనలు పునరావృతమైతే ఆపరేషన్ సిందూర్ లాంటివి కూడా మళ్ళీ పునరావృతం అవుతాయనీ, అందుకు ఇండియా ఆర్మీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఉగ్రవాదంపై మన రక్షణ దళాలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సెల్యూట్ చేసారు. ప్రపంచం గర్వించదగ్గ మన రక్షణ కవచంలా మన త్రివిధ దళాలు ఒక్క భారతదేశంలోనే ఉన్నాయనీ గర్వపడుతున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షుడు శేఖర్,లాయర్ హరికృష్ణ ,జ్యోతి ప్రసాద్ ,రామాంజినేయులు సూర్యనారాయణ ,నారాయణ,జన సేన నాయకులు పత్తి చంద్రశేఖర్,అబ్దుల్లా ,టీడీపీ నాయకులు బోయ రామాంజినేయులు, మహమ్మద్ రఫీ, బేకరీ గంగాధర, సామకోటీ ఆదినారాయణ , రామారావు, లక్ష్మీపతి, గంగాధర్ నాయుడు, పిసి.గంగన్న, బెస్త చలపతి, శుభచంద్ర ,సురేష్ చౌదరి, కృష్ణ ప్రసాద్, ఓబులేసు, ఎనుములపల్లి తిరుపాల్ మాల మనోహర్,ఉమాపతి,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి టిడిపి కన్వీనర్ పోస్టుకు పెరిగిన ఆశావాహులు

-పోటీలో 9 మంది -ప్రస్తుత కన్వీనర్నే కొనసాగించాలి -పలువురు టిడిపి నేతల సూచన



తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న జయప్ప

లేపాక్షి, మే 17 ప్రభాతవార్త

లేపాక్షి మండల తెలుగుదేశం పార్టీ నూతన కన్వీనర్ ఎంపికపై సందిగ్ధం నెలకొంది. హిందూపురం పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా టిడిపి అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, ఎమ్మెల్యే కార్యదర్శి సురేంద్ర అధ్యక్షతన మండల తెలుగుదేశం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిఏ సురేంద్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హై కమాండ్ సూచన మేరకు నూతన కన్వీనర్ పోస్ట్ ఎంపిక నాయకుల అభిప్రాయాల మేరకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ప్రతిపక్షంలో వుంటూ పలు సమస్యలను ఎదుర్కొన్నానని, ప్రస్తుతం ఈ పర్యాయం తననే కన్వీనర్గా కొనసాగించాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పలువురు టిడిపి మండల నాయకులు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగునున్నాయని జయప్ప కన్వీనర్గా గత ఆరేళ్లుగా మండల వ్యాప్తంగా అందరితో కలిసి మెలిసి వున్నాడని అతన్నే కన్వీనర్గా కొనసాగించాలని ఎమ్మెల్యే పిఏను కోరారు. లేపాక్షి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద్కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కన్వీనర్ జయప్పకు కన్వీనర్ పోస్ట్ ఇవ్వని పక్షంలో తనకే కేటాయించాలని కోరారు. కోడిపల్లి పంచాయతీకి చెందిన జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గానికి కన్వీనర్ పోస్టును కేటాయిస్తే తననే నియమించాలని కోరారు. అదేవిధంగా తమ కుటుంబం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసమే కృషి చేస్తున్నామని తనకే కేటాయించాలని వెంకటాపురం అభి కోరారు. అదేవిధంగా కన్వీనర్ పోస్టును ఆశించిన వారిలో నాయనపల్లి వీరశేఖర్, కొండూరు సర్పంచు సిద్దార్థ్, నాయనపల్లి సదాశివరెడ్డి, పులమతి అశ్వర్థ, కొండూరు ప్రభాకర్రెడ్డి తదితరులు కన్వీనర్ రేసులో వున్నారు. అయితే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కన్వీనర్గా జయప్పనే కొనసాగించాలన్న అభిప్రాయాలను పలువురు టిడిపి నేతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అసలైన లిక్కర్ స్కాం కూటమి ప్రభుత్వంలోనే జరుగుతోంది

**మొదటిపేజి తరువాయి...** సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్లపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కొందరు అధికారులకు పోస్టింగ్స్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల వాళ్లు కూడా విస్తుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో స్కిల్ స్కాంలో చంద్రబాబును సాక్షాధారాలతో అరెస్ట్ చేశారని, ఈ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా జగన్పై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. సర్వీస్లో ఉన్న వారినే కాకుండా రిటైర్డ్ అయిన అధికారులను కూడా అరెస్ట్ చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్ కార్యదర్శిగా పని చేసిన ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ఓఎస్డీగా పని చేసిన కృష్ణమోహన్రెడ్డిని అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు ఏ డిస్టలరీ ద్వారా మద్యం సరఫరా జరిగిందో అవే డిస్టలరీల నుంచే వైఎస్ జగన్ హయాంలోనూ జరిగాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా అవే డిస్టిలరీలు మద్యం సరఫరా చేస్తున్నాయని తెలిపారు. వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకపోయినా..తప్పుడు కేసులు పెడుతూ, అందులో అందరి పేర్లు చేరుస్తూ, తప్పుడు సాక్షాలు సృష్టిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యల కారణంగా భవిష్యత్లో రాష్ట్రంలో ఏ అధికారి పనిచేయలేని పరిస్థితిని తీసుకొస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పనిచేయలేక కొందరు అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. చివరకు హైకోర్టు జడ్జిలు అక్షింతలు వేసినా ఏమాత్రం సిగ్గు లేకుండా ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గించాలన్న లక్ష్యంతో కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేట్ మాఫియాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వం ద్వారానే మద్యం అమ్మకాలు చేశామని, బెల్ట్షాపులను నిర్మూలించామన్నారు. అసలైన మద్యం స్కాం అనేది ఈ కూటమి ప్రభుత్వంలోనే జరుగుతోందన్నారు. అనుమతి ఇచ్చిన దుకాణాల కంటే మూడింతలు అధికంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోనే పరిస్థితి దారుణంగా ఉందని ప్రముఖ పత్రికనే కథనాలు వస్తున్నాయని తెలిపారు. ఏ షాప్లో చూసినా అధిక రేట్లకు మద్యం అమ్ముతున్నారన్నారు. అనంతపురంలో ఏ షాప్లో చూసినా ఎమ్మార్పీ ధర కంటే రూ.30 వరకు అధికంగా అమ్ముతున్నారని, పర్మిట్ రూంలు కూడా విచ్చలవిడిగా ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడ చూసినా ఇసుక, మద్యం, మట్టి, కంకర దోపిడీ జరుగుతోందన్నారు. మరోవైపు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితిలో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. తప్పుడు కేసుల్లో జగన్ను ఇరికిస్తేనే తమ పార్టీలకు మనుగడ ఉంటుందని కూటమి పార్టీలు భావిస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యంపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు నమ్మకం లేదని.. భవిష్యత్లో ఆ పార్టీలకు ప్రజలు ఓట్లు వేయరని అప్పుడే గ్రహించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎంతో మంది నియంతలు కాలగర్భంలో కలిశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ను నైతికంగా దెబ్బతీయాలని చూస్తున్నారని తెలిపారు. అక్రమ కేసులు, అరెస్టులు చేసినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నుంచి నాయకుల వరకు ఎవరూ భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కూటమి పార్టీలకు భవిష్యత్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

## తిరంగా యాత్రలో ఉట్టిపడిన దేశభక్తి

**-పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్**

ఉరవకొండ, మే 17 ప్రభాతవార్త



ఉరవకొండలో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ పట్టణంలో శనివారం సాయంత్రం తిరంగా యాత్ర ఘనంగా జరిగింది. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా స్థానిక బళ్లారి బైపాస్ రోడ్డు నుండి ప్రారంభమై పట్టణ ప్రధాన వీధి గుండా జరిగిన తిరంగా యాత్రలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్యపన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. జాతీయ జండాలను చేతబట్టి మేరా భారత్ మహాన్ అంటూ నినదించారు. ఈసందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగాపెట్టి దేశాన్ని కాపాడుతున్న సైనికుల సేవలు అజరామరం అన్నారు. ఆపరేషన్ సింధూర్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకుచెందిన జవాన్ మురళీనాయక్ ప్రాణాలుపోగొట్టుకొని అమరుడయ్యారని ఆయన చిరస్మరణీయులన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.మహబూబ్బాషా, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, సీఐలు బి.మహానంది, సయ్యద్ చిన్నగౌస్, ఎస్ఐ పి.జనార్ధననాయుడు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# నమో నారసింహ..!!



ఆర్థిక మంత్రికు స్వామివారి చిత్రపటాన్ని అందించి సత్కరిస్తున్న ఈవో సాకే రమేష్బాబు

**మొదటిపేజి తరువాయి...** సమర్పించారు. ప్రధానాలయంలో లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి పయ్యావుల కేశవ్కు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన





ప్రత్యేకాలంకరణలో లక్ష్మినరసింహుని మూలవిరాట్ , ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులు

నృసింహస్వామివారి ఉత్సవమూర్తులను మంత్రి పయ్యావుల కేశవ్ మోస్తూ మేళతాళాల నడుమ ప్రత్యేకంగా ముస్తాబుచేసిన రథంవద్దకు తీసుకురాగా రథంలో ప్రతిష్టించి బ్రాహ్మణులు మడుగుతేరు కార్యక్రమాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించగా మంత్రి పయ్యావుల కేశవ్ రథాన్ని లాగారు. సాయంత్రం రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులు నమో నారసింహ అంటూ బ్రహ్మరథాన్ని (ధూళోత్సవం) నిర్వహించారు. ఉద్బవలక్ష్మి ఆలయంవద్ద నుండి ప్రధాన ఆలయమున్న కొండచుట్టూ రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమం అరగంటపాటు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్బాబు, సీఎఫ్వో డి.పాండురంగారెడ్డి, తహశీల్దార్ ఎస్.మహబూబ్బాషా, అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీచార్, గుండురావు స్వామి, వాసుస్వామి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భక్తులతో కిక్కిరిసిన పెన్నహోబిళ క్షేత్రం:**

లక్ష్మినరసింహస్వామి బ్రహ్మ రథోత్సవ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పెన్నహోబిళ క్షేత్రం కిక్కిరిసింది. రథోత్సవ సమయంలో మాడవీధులన్నీ ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోయాయి. భక్తులు అనేకమంది తలనీలాలు సమర్పించి కొండపైనున్న లక్ష్మినరసింహస్వామిని కొండ కింద ఉద్బవలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ పోలీస్ బందోబస్తు:**

బ్రహ్మ రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా



రథాన్ని లాగుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉరవకొండ యుపీఎస్ సీఐ మహానంది, రూరల్ సీఐ చిన్నగౌస్, సీఐలు వెంకటేశ్వర్లు, ప్రవీణ్కుమార్, రాజు, ఎస్ఐలు జనార్ధననాయుడు వెంకటస్వామి, నాగుస్వామి, మురహరి, ఉరవకొండ, విడపనకల్లు వజ్రకరూరు, కూడేరు, గుంతకల్లు, బెలుగుప్ప తదితర పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. విపత్తు నివారణ, అగ్నిమాపకశాఖ అధికారి భీమలింగయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. రథోత్సవం ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా కొనసాగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**జాతీయ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్:**

రథోత్సవం కార్యక్రమం అనంతరం భక్తులు తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. ద్విచక్రవాహనాలు, చిన్న పెద్ద వాహనాలన్నీ రోడ్డుపై అరగంటపాటు ఎక్కడివక్కడ నిలిపోవాల్సి వచ్చింది. పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

# దేశం కోసం సైనికులు చేస్తున్న త్యాగాలకు సెల్యూట్

**మొదటిపేజి తరువాయి...** పయ్యావుల కేశవ్, వై.సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. మంత్రులతోపాటు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివనారాయన్ శర్మ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లెరఘునాథ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, ఆయాశాఖల జిల్లా అధికారులు, అన్ని వర్గాల నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఎన్జీఓలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెషనల్స్, వ్యాపార సంస్థలు, టీచర్లు, పోలీసులు, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, తదితరులు పాల్గొన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలిచిన సైనికులకు, సైనిక శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుస్తూ దేశం మొత్తం మీద జరుగుతున్నటువంటి తిరంగా యాత్రలో భాగంగా ఈరోజు నా అనంతపురం జిల్లాలో హాజరైన వేలాదిమందికి హృదయపూర్వక నమస్కారాలు తెలుపుతున్నామన్నారు. దేశం ఒక్కటే అన్నటువంటిది మన గుండెచప్పుడని ఈరోజు అర్థం అవుతుందన్నారు. ఇంత ఉదయాన్నే వేలమంది ఇక్కడ హాజరయ్యారంటే దేశభక్తి ప్రతి గుండె చప్పుడుగా మారింది అనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరంలేద న్నారు. మొన్నటి దాకా సైన్యంలో పనిచేసిన ఉమ్మడి అనంతపురం జిల్లా వాసి అయిన ఎం.మురళినాయక్ ప్రాణాలు పోగొట్టుకోవడం జరిగిందని, వారు మన రక్షణ కోసం చేసినటు వంటి త్యాగాలకు బాసటగా నిలవాలన్నారు. త్రివిధ దళాలకు సంబంధించిన సైన్యానికి మద్దతుగా ఈ దేశం మీ వెనకాలే ఉందని, దేశం కోసం మీరు చేస్తున్న త్యాగాలకు దేశం గుర్తిస్తుం దని మేము మీకోసం సెల్యూట్ చేస్తున్నామన్నా రు. మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ మాట్లాడు తూ.. మన సైనికులకు





అండగా ఉందామన్నారు. పహల్గం ఉగ్రదాడిలో అమాయక పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని హతమార్చడం జరిగిందని, ఇందుకు దేశమంతా బరువెక్కింది, ప్రతిభారతీయుడు కళ్ళు ఎరుపెక్కాయన్నారు. మనందరి మనోభావాలకి ఆకాంక్షలకి అనుగుణంగా మన సైన్యం సమర్థ నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో పాకిస్తాన్ వారికి సమాధానం గట్టిగా చెప్పిందని, దేశంలో అమాయకులపై దొంగచాటుగా దెబ్బతీస్తే మనం ముందుగానే వారికి చెప్పి ఆ ఉగ్రవాద శిబిరాలపై దాడిలు చేసి పాకిస్తాన్ పౌరులకి ఎలాంటి గాయం కాకుండా కేవలం ఉగ్రవాదులు, ఉగ్రవాద శిబిరాలయాలే లక్ష్యం చేసుకుంటూ మన సైన్యం ధ్వంసం చేసిందని తెలిపారు. మన ఉమ్మడి అనంతపురం జిల్లా నుండి ఒక సైనికుడు మురళి నాయక్ ప్రాణాలు కోల్పోవడం, వారి అంత్రక్రియలకు మనమంతా పాల్గొనడం జరిగిందని తెలిపారు. వారి కుటుంబాలను వారి ఊరుని వదిలి అనేక ప్రతికూల పరిస్థితుల్లో సరిహద్దుల్లో మనమంతా సురక్షితంగా ఉండాలని శత్రువులకు ఎదురొడ్డి పోరాడుతున్న మన సైనికులు అందరికీ మన మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని, ఇవాళ మన దేశంలో ప్రతి ఒక్క పౌరుడు రాజకీయాలకతీతంగా, మతాలకతీతంగా జరుగుతున్న తిరంగా యాత్రలో జాతీయ పతాకాన్ని భుజాన వేసుకుని సైనికులు అండగా నిలబడడం విశేషమని మంత్రి అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పహాల్గం ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా, దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు కృషి చేసిన మన సైనికుల తీరు అభినందనీయమన్నారు. అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారత దేశ త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగ యాత్ర ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. మన సైనికులు దేశం కోసం ఉగ్రవాదులపై దాడిని అభినందనీయమని, ప్రస్తుత పరిస్థితుల్లో సైనికులకు అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాగా తిరంగా యాత్ర అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గ్రౌండ్ నుండి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం చేరుకుని జాతీయ గీతాలాపన చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అనంతపురం ఆర్డిఓ కేశవ నాయుడు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, డివిఈఓ వెంకటరమణ నాయక్, డీఈఓ ప్రసాద్ బాబు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వేంకటేశ్వరరావు, డిఎంహెచ్ఓ ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, అన్ని వర్గాల నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు, ఎన్జీఓలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెషనల్స్, వ్యాపార సంస్థలు, టీచర్లు, పోలీసులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీ సేవలు ఆగిపోతే నష్టపోయేది బడుగు,బలహీన వర్గాలు,పేదలే

**- కేంద్రం చర్యలతో ఆర్డీటీ మనుగడ ప్రశ్నార్థకం - సేవ్ ఆర్డీటీ పేరుతో తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**

**- బ్రహ్మసముద్రంలో ర్యాలీని ప్రారంభించిన అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ**

కళ్యాణదుర్గం (బ్రహ్మసముద్రం), మే 17 ప్రభాతవార్త

ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ (ఎఫ్సీఆర్ఏ) రిజిస్ట్రేషన్ను రెన్యూవల్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, కరువు జిల్లా గా ఉన్న అనంతపురం జిల్లాలోని నిరుపేదలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అందిస్తున్న ఆర్డిటి ఆగిపోతే తీవ్రంగా నష్టపోయేది పేద ప్రజలేనని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త తలారి రంగయ్యలు హెచ్చరించారు. "సేవ్ ఆర్డీటీ" పేరుతో శనివారం వైసీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మసముద్రం నుంచి కళ్యాణదుర్గం వరకు చేపట్టిన ఈ ర్యాలీని బ్రహ్మసముద్రంలో అనంత వెంకటరామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఉమామహేశ్వర నాయుడు తో కలసి విలేకరులతో మాట్లాడుతూ"ఐదున్నర దశాబ్ధాల క్రితం జిల్లాలో కరువు పరిస్థితులు చూసి కరువు, పేదరికంపై యుద్ధం ప్రకటించి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్ డి టి ని స్థాపించారు. ఏళ్ల తరబడి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తూ వ్యవసాయంలో నిరుపేద రైతులకు ఆయిల్ ఇంజన్లతో నీటిని సమకూర్చే పథకంతో ప్రారంభించి వ్యవసాయ రంగంలో కుంటకథలు ఫారం పాండ్లు ఇంకుడు గుంతలు లాంటి కరువు నివారణ పథకాలను ప్రారంభించి, వాటర్ షెడ్ పథకాలతో పాటు అనూహ్యమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పేద రైతులకు పరిచయము చేసి వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి పంట దిగుబడులను పెంచి, రైతుకు ఆత్మస్థైర్యాన్ని పెంచాలని అన్నారు.పండ్ల తోటల పెంపకం ప్రోత్సహించాలన్నారు. పేదలకు విద్య వైద్య రంగాలలో విలువలతో కూడిన విద్యతోపాటు ఎందరో పేద పిల్లలను స్పాన్సర్ చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని, అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రులను నిర్మించి పేదవాడి ఆరోగ్యానికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహించి ఎంతో మంది జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దాడన్నారు. హరిజన, గిరిజన దళిత వర్గాలకు పక్కా గృహాలు నిర్మించి గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలన్నారు. ప్రభుత్వాలు చేయలేని ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేసి నిజాయితీగా అందించిన సేవలు ప్రజల గుండెలను తాకాయని, అందుకే



సేవ్ ఆర్ డి టి నినాదంతో భారీ బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

కుందుర్పి మండల కేంద్రంలో ఫెరర్ గుడి కట్టి పూజిస్తున్నారన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు తనదైన శైలిలో కుల, మత వర్గ భేదాలు లేకుండా చేస్తున్న సంస్థపై మతసంస్థగా ముద్రవేసి ఎఫ్సీఆర్ఏ పునరుద్ధరించకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ, టిడిపి, జనసేన పార్టీల అధినేతలు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అనంతరం జిల్లా ప్రత్యేక పరిస్థితులను వివరించి ఆర్డిటి సంస్థకు ఎస్సీ ఆర్ ఏ నిధుల పునరుద్ధరణ పై చర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలోనే కాకుండా ఢిల్లీ వీధుల్లో కూడా ఆందోళన చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి ప్రస్తామని ప్రజల కోసం ఎన్ని కష్టాలైనా ఎదుర్కొని పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు.ఎన్డీయే ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రంలో చంద్రబాబు మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఆర్డీటీకి ఎఫ్సీఆర్ఏ రెన్యూవల్ చేయకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, యాంకర్ శ్యామల, మహిళా నాయకురాలు చందన శివాజీ, వైసీపీ నాయకులు ఉమామహేశ్వరనాయుడు, బోయ తిప్పేస్వామి, న్యాయవాది హనుమంత రెడ్డి,రఘునాథరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేశులు కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ళ సూరి, తలారి సత్యప్ప, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, కౌన్సిలర్లు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

03ATP17_03ATP17.qxd 17-05-2025 PM 10:36 Page 1



# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

- పెండింగ్ లో ఉన్న క్లైములను వెంటనే పరిష్కరించాలి
- ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి



**పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటియుసి నాయకులు**

అనంతపురం మే 17 ప్రభాతవార్త

ఎఐటియుసి అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 5 వ మహాసభలు జయప్రదం చేయాలని శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పోయిన ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. 4293 కోట్ల రూపాయలు ప్రభుత్వ పథకాలకు మళ్లించారన్నారు, కార్మికులకు రావాల్సిన 56 వేల క్లైముల బకాయి ఉన్నాయన్నారు, చెస్సుల రూపంలో వసూలు చేసి కార్మికుల సంక్షేమ నిధిగా దాచిన సొమ్మును ప్రభుత్వం ఇలా వాడుకోవడం సరైంది కాదన్నారు,కార్మికుల శ్రేయస్సును పూర్తిగా ప్రభుత్వాలు విస్మరించాయన్నారు,50 సంవత్సరాలు పూర్తి అయిన కార్మికులకు పింఛను ఇవ్వాలన్నారు,సంక్షేమ బోర్డును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలన్నారు,భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై జూన్ 8 న జరుగు జిల్లా 5వ మహా సభలో చర్చిస్తామని ఆ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, ,నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ,జిల్లా నాయకులు డోన్ రామాంజి, లక్ష్మన్న,శ్రీరాములు,శ్రీరామ్,ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడంతో కాలుష్య నియంత్రణ సాధ్యం

అనంతపురం వైద్యం మే 17 ప్రభాతవార్త



**మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు**

మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నియంత్రణ సాధ్యం అవుతుందని అనంతపురం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు అన్నారు శనివారం మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలసి బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాతావరణంలో వేడిని తగ్గించడంలో మొక్కలు చాలా కీలక పాత్ర పోషిస్తాయని, వాతావరణ కాలుష్యం వల్ల వాతావరణంలో వేడి పెరిగుతుందని తెలిపారు. మొక్కలు నాటడంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వాలంటీర్లకు సభ్యత్వం కిట్ల అందజేత



**జనసేన పార్టీ వాలంటీర్లకు సభ్యత్వ కిట్లను అందజేస్తున్న దృశ్యం**

అనంతపురం వైద్యం మే 17 ప్రభాతవార్త

జనసేన పార్టీలో 50 మంది క్రియాశీలక వాలంటీర్లకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన సభ్యత్వ కిట్లను జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు ఆహుడా చైర్మన్ టి సి వరుణ్ అందజేశారు శనివారం జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యాల యం నుండి వచ్చిన సభ్యులతో కలిసి వరుణ్ పాల్గొని వాలంటీర్లకు సభ్యత్వ కిట్లను అందించారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి వరకు జనసేన పార్టీని విస్తరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి, అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్య దర్శిలు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జనసేన సీనియర్ నాయకులు కాయగూర లక్ష్మీపతి, జిల్లా కార్యదర్శిలు సంజీవ రాయుడు, రాపా ధనుం జయ్, ఇండ్ల కిరణ్ కుమార్, సిద్ధూ, జిల్లా సహాయ కార్యదర్శులు జయమ్మ, అవుకు విజయకుమార్, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్ పాల్గొన్నారు.

# అధిక రక్త పోటు ను నియంత్రించుకోవాలి



**ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబి.దేవి**

అనంతపురం వైద్యం మే 17 ప్రభాతవార్త

అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి సూచించారు. శనివారం ప్రపంచ అధిక రక్తపోటు అవగాహన దినోత్సవం పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యం నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహిం చారు అధిక రక్తపోటు వల్ల కలిగే దుష్ప్రయోజనాలను గూర్చి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాన్స్‌కో కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర



**ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది**

అనంతపురం కలెక్టరేట్, మే 17 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ట్రాన్స్‌కో ఎస్‌సి శేషాద్రిశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణాన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఒ రాజశేఖర్, ఇఇ ప్రసాదు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్లాండ్ వైఎస్ఆర్‌సిపి గ్లోబల్ కనెక్ట్ సమావేశం విజయవంతం

- జగనన్న పాలన అంటే మాటలు కాదు సంక్షేమం, అభివృద్ధి, నిజాయితీ: ఆలూరు సాంబ శివారెడ్డి

శింగనమల, మే 17 ప్రభాతవార్త






**మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, పాల్గొన్న ఎన్ఆర్ఐలు**

వైస్సార్సీపీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఆక్లాండ్ (న్యూజిలాండ్)లో గ్లోబల్ కనెక్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో ప్రవాసాంధ్రులు హాజరై తమ మద్దతును తెలిపారు. ఎన్ఆర్ఐ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ.. జగన్ పాలన అంటే మాటలు కాదు సంక్షేమం, అభివృద్ధి, నిజాయితీ కలసిన ప్రజా పాలన అన్నారు. జగన్ పరిపాలన గణాంకాలతో ధృవీకరించబడిన అభివృద్ధి అన్నారు. పాలనా రంగంలో15,004 గ్రామ/వార్డ్ సచివాలయాలు, 2.6 లక్షల వాలంటీర్లు సేవల్లో, స్పందన ద్వారా లక్షలమంది సమస్యలు పరిష్కారించబడ్డాయన్నారు. ఆరోగ్య రంగంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఆరోగ్యశ్రీ పరిధి 3,000పై చికిత్సలకు పైకి విస్తరణ, 10,000 వైఎస్ఆర్ ఆరోగ్య క్లినిక్స్‌ను తీసుకొచ్చి వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు.

విద్యా రంగంలో నాడు-నేడు ద్వారా 50,000 పైగా పాఠశాలలు ఆధునీకరణ, ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, టోఫెల్, సిబిఎస్ఇ సిలబస్, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా లక్షల మందికి లబ్ధిని చేరుర్చారన్నారు. ఆర్థికాభివృద్ధిలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు, రూ.4.47 లక్షల కోట్ల డిబిటి ద్వారా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకి జమా చేసారన్నారు. రూ.6.16 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 28.89 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు, జిఎస్‌డిపి వృద్ధిరేటు 11.43 శాతం దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపారన్నారు. జగన్ పాలనలో జరిగిన రాష్ట్ర అభివృద్ధికి ఆధారంగా కాగ్ నివేదికలు, కేంద్ర గణాంకాలు ఉన్నాయన్నారు. విపక్షాల అబద్ధ ప్రచారంపై స్పందిస్తూ లిక్కర్ కేసు నకిలీ, రాజకీయ కుట్ర, టీడీపీ, జనసేన కూటమి తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం, ఇవన్నీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసే ప్రయత్నాలేనని అన్నారు.

**ఎన్ఆర్ఐలు సోషల్ మీడియా పాత్రపై పిలుపు :**

మీ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ప్రజలకు నిజం చెప్పే ఆయుధం అన్నారు. సోషల్ మీడియాలో నిజాలు చెప్తూ, పచ్చ మీడియాను ఎదుర్కోనాలన్నారు. జగన్ నాయకత్వం ఎలా ఉంటుందో ప్రపంచానికి తెలియజేయాలన్నారు. నిజం మాట్లాడే గొంతులుగా, అభివృద్ధిని ప్రదర్శించే వేదికలుగా ఎన్ఆర్ఐలు ముందుకు రావాలన్నారు. ఆక్లాండ్ మీటింగ్ చాలా ఉత్సాహంగా జరిగిందని ఈ స్ఫూర్తిని సింగపూర్ మీటింగ్‌కి తీసుకెళ్తున్నానని ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జిబాబు, కోకన్వీనర్లైన ఆనంద్ ఎద్దుల, సమంత్ దేగాపూడి నేతృత్వం వహించారు. అలానే కృష్ణారెడ్డి, గోవర్ధన్ మల్లెల, బాలవేణు బీరం, జగదీశ్వరరెడ్డి, రఘునాథరెడ్డి తదితర సీనియర్ వైఎస్సార్సీపీ అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామ పంచాయతీల్లో

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

- జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు



**కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు**

అనంతపురం కలెక్టరేట్, మే 17 ప్రభాతవార్త

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని డిపిఓ ఛాంబర్‌లో శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడు తూ పలు అంశాలను వెల్లడించారు. జిల్లాలో వున్న అన్ని పంచాయతీల్లో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, జిల్లా పరిషత్ సిఇఒ రామ చంద్రారెడ్డిలు పెద్దపప్పూరు మండలంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన తెలియచేశారు. ఇందులో భాగంగా ఎస్‌డబ్ల్యూపిజి షెడ్లను సందర్శిం చారు. ఎంపిడిఓ కార్యాలయంలో రూఫ్ వాటర్ స్ట్రక్చర్ ఓపెనింగ్ చేశారు. పశు వుల నీటి తొట్టె ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎండవేడిమిని ఎదుర్కొ నేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను వడదెబ్బ నుండి రక్షించే దుకు, నీటివనరుల పరిరక్షణకు కృషి చేయాలని తెలిచేయడం జరిగిందన్నారు. చలి వేంద్రాల ద్వారా తాగునీరు అందించాలని, విరివిగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం కార్యక్రమంపై ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శకుంతల, డిప్యూటి ఎంపిడిఓ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి గంగామహేశ్వరరెడ్డి, పంచాయతీసిబ్బంది పాల్గొన్నారు.

# తీవ్రమైన ఎండల పై అవగాహన



**స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ**

బుక్కరాయసముద్రం మే 17 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మూడవ శనివారం సందర్భంగ గౌరయ్యకొట్టాల్లో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ దాసరి సునీత,ఎంపీడీవో సాల్మన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం నందు నిర్వహించిన కార్యకలాపాలు తీవ్రమైన ఎండల నుండి ప్రజలు పాటించాల్సిన,పాటించకూడని అంశాల పై చర్చించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.అనంతరం ఎండా కాల రీత్యా రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు, సచివాలయం -4 నందు మొక్కలు నాటడం జరిగింది,గౌరయ్య కొట్టాల నందు ప్రత్యేక మైద్యశిబిరం నిర్వహించడంతోపాటు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు సిబ్బందిచే శుభ్రపరిచి శ్రమాధానం చేయడం జరిగింది.కార్యక్రమం ముగింపు సమయంలో గౌరయ్య కొట్టాలనుండి మెయిన్‌రోడ్డువరకు తిరంగా ర్యాలీ నిర్వహించడంతోపాటు పాకిస్తాన్ తో యుద్ధం చేస్తూ ప్రాణాలు అర్పించిన అగ్నివీర్ జవాన్ మురళినాయక్ కి నివాళిలు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వరితోపాటు ఈఓఆర్డి సదాశివా,ఎపిఓ సజాత,పంచాయితీ కార్యదర్శి పెద్దశ్రీనివాసులు,మెడికల్ ఆఫీసర్, బుల్లే నారాయణస్వామి, వెలుగు ఎపియం నారాయణస్వామి, ఎంఇఓలు, పంచాయితీ, సచివాలయం సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాచానపల్లి లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర



**స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటుతున్న దృశ్యం.**

అనంతపురం రూరల్ మే 17 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం రాచనపల్లి పంచాయతీ గ్రామ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ మూడవ శనివారం స్వర్ణాద్ర.స్వచ్ఛంద్ర కార్య క్రమంలో లో భాగంగా తన సిబ్బందితో కలసి చెత్త చేదా రాని శుభ్రపరిచారు. సచివాలయంలో స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా మహిళలందరినీ సమావేశపరిచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హైసేవ గురించి ప్రతిరోజు ఇంటి చుట్టూ పరిసరాలు ఇంట్లో కూడా శుభ్రంగా ఉండాలని మన ఇల్లు మన వీధి మన గ్రామం శుభ్రంగా ఉన్నప్పుడు మాత్రమే మంచి ఆరోగ్యకరమైన వాతావరణం కలిగి ఉంటామని మహిళాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ మహిళలు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్యుద్ధం వద్దు శాంతి ముద్దు

- ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ నేతలు



**నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం**

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల మీద జరుపుతున్న అణిచివేతను, హత్యాకాండను వెంటనే ఆపాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా కమిటీ నేతలు పేర్కొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి ఆదివాసి ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పడానికి తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తూ చర్చల అనుకూల వాతావరణాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే కల్పించాలని కోరుతూ ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు అనంతపురంలోని కృష్ణ కళామందిర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన శాంతి ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను శనివారం అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక, పార్టీల, ప్రజాసంఘాల ఐక్యవేదిక ద్వారా విడుదల చేశారు. కరపత్రాల ఆవిష్కరణకు ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ టి.విశ్వనాథ్ వర్మ, ఎమ్మార్పిఎస్ జిల్లా నాయకులు బండారు అనిల్ కుమార్ నాయకత్వం వహించగా ఈ ఆవిష్కరణకు ఎమ్మార్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కెపి నారాయణస్వామి, జై భీమ్ పార్టీ నాయకులు బికెఎస్ ఆనంద్, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు ఆదినారాయణ, ఓపిడిఆర్ జిల్లా నాయకులు జి ప్రకాష్, ప్రజా కళామండలి నాయకులు విజయ్, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కిష్టప్ప, అరుణోదయ కళాకారుడు చంద్రన్న, కెఎన్‌పిఎస్ నాయకులు ఓబులయ్య, పిడిఎం నాయకులు, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకురాలు కె.లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ నాయకులు ఓబులయ్య, ఎస్సీ ఎస్టీ ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మద్దెలచెరువు మల్లీ, ఆల్ ఇండియా ప్రజా హక్కుల పార్టీ జిల్లా నాయకులు నాగరాజు, అడ్వకేట్ చెన్నకేశవులు దళిత సంఘాలు, హక్కుల, ప్రజాస్వామిక, రాయలసీమ సంఘాలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

# మాదిగలకు సమన్యాయం చేయాలి



**మాట్లాడుతున్న నేతలు**

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త

ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఇరు రాష్ట్రాల సమన్వయకర్త పేరు పోగు వెంకటేశ్వరరావు, మాదిగ గారు రాష్ట్ర పర్యటనలో భాగంగా అనంతపురం జిల్లా ఎంజిఓ హోమ్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. ఎస్సీ వర్గీకరణ రోస్టర్‌లో 8 మాలలకు, ఆరు మాదిగలకు సరికాదని ఏడు మాదిగలకు ఏడు మాలలకు ఇచ్చి సమన్యాయ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్‌లో మాదిగలకు న్యాయం జరుగుతుంటే ఎస్సీ వర్గీకరణ జరిగింది సంబరాలు చేయండని మందకృష్ణ పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు పేరుపొగు వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మాదిగలు పోరాటం చేసింది సమ న్యాయం కోసం అని ఈ ఆర్డినెన్స్ వల్ల మాదిగలకు తీరని నష్టం అని విమర్శించారు. ఎస్సీ సంక్షేమ పథకాల నిధుల విషయంలో వర్గీకరణ లేదని ఉపాధి పథకాలు మాదిగ నిరుద్యోగ యువతకు ఉపయోగపడే లా లేవని వెంటనే ఆ పథకాలు అమల్లో లోపాలను సరి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, రాచపల్లి రామాంజనేయులు, మద్దిలేటి, గంగిశెట్టి, ఓబులేసు, రామంజప్ప, శ్రీనివాసులు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష తగదు..

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం వైద్యం మే 17 ప్రభాతవార్త


ఎయిడ్స్ వ్యాధితో బాధపడు తున్న వారి పట్ల వివక్ష జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అని కుమార్ జేమ్స్ అన్నారు. ఈనెల 18వ తేదీన అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుండి వైద్య శాఖ సిబ్బందితో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఎయిడ్స్ నివారణ చర్యల్లో భాగంగా అసువులు బాసిన వారిని స్మరించ డం బాధితుల పట్ల వివక్ష చూప కుండా ఉండటం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.


**In the Court of the 1st Addl District Judge, Anantapuramu**
**O.S. No: 18/2022**
*Between:*
Pamula Obulesu and Others. ..Plaintiffs
And
Pamula Venkatamma and Others ..Defendants
**Notice to Defendant No:45 and 46**
**D45:** Kummara Venkataramudu S/o Late Kummara Anand
**D46:** Kummara Alivelu W/o Nagesh D/o Late Kummara Anand. Both are R/at D/no: 2/149, Kummara Veedhi, Bukkarayasamudram Mandal.
పై నెంబరు కేసులో Defendants అయిన మీ హాజరు నిమిత్తం 17-06-2025 వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీ ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
**B.Vijayakumar, Advocate**
**Anantapuramu Cell: 9440286003**


# ఆర్డీటీని కాపాడండి

గవర్నర్‌ను కోరిన సాకే హరి

అనంతపురం న్యూటౌన్, మే 17 ప్రభాతవార్త



**గవర్నర్‌తో మాట్లాడుతున్న సాకే హరి**

అనంత జిల్లా కల్ప తరువు ఆర్డీటీ తరలి పోకుండా మీరే కాపాడా లని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు. జేఎన్టీయూ స్నాత కోత్స వంలో పాల్గొనేందుకు జిల్లా పర్యటనకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ విచ్చేసిన సందర్భం గా అయనను ఆర్ అండ్ బి అతిథి గృహంలో సాకే హరి కలిసి పేదల సంక్షేమమే ధ్యేయంగా సేవలు చేస్తున్న ఆర్డీటీకి పూర్వపు మాదిరిగానే విదేశీ నిధులు వచ్చేటట్లు చూడాలని కోరారు. కేంద్రంలో ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ కాకుండా అంక్షలు పెట్టారని దీనివల్ల ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 21 జిల్లాల్లోని పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. 56 సంవత్సరాలు కాలంగా కుల, మతాలకు అతీతంగా పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా పెట్టుకుని అన్ని రకాల సేవలు అందించిన ఆర్డీటీ పేదల హృదయాల్లో నిలిచిపోయిందని తెలిపారు. గవర్నర్ స్పందించిన తీరు హర్షనీయమని ఆర్డీటీ సేవలు పేద ప్రజలకు నిరంతరం కొనసాగేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే సురేంద్రబాబు కుమార్తె పెళ్లితో రోడ్లకు మహర్దశ





**శ్రీనగర్ కాలనీలో వేసిన కొత్తరోడ్లు దృశ్యాలు**

అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో

ప్రముఖ నిర్మాణ సంస్థ అధినేత, కళ్యాణదుర్గం శాసనసభ్యుడు అమిలినేని సురేంద్రబాబు కుమార్తె శ్రీచరిత,రాహుల్‌ల వివాహాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో రోడ్లకు మహర్దశ రావడం విశేషం. నగరంలోని రాంనగర్‌లోని 80 అడుగుల రోడ్డులో అయ్యప్ప స్వామి గుడి వరకు ఉన్న రోడ్డులో కొత్తగా తారు రోడ్డు వేయించడం, డివైడర్లు వేయించడం, డివైడర్ల మధ్యలో చెట్లు నాటించడం లాంటి అభివృద్ధి పనులు చక చకా జరిగిపోయాయి. శ్రీనగర్ కాలనీలో కూడా పలు రోడ్లు బాగుపడ్డాయి. ఎమ్మెల్యే కుమార్తె పెళ్లి వల్ల తమ ప్రాంతంలో రోడ్డు బాగుపడ్డాయని, ప్రజా ప్రతినిధులు తమ పిల్లల పెళ్లిళ్ల చేసినప్పుడు ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా సుబ్బి పెళ్లి తమ చావుకు వచ్చిందని ఒక సామెత వాడుకలో ఉంది.. అయితే ఇక్కడ దానికి విరుద్ధం.. ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేతలు అమిలినేని సురేంద్రబాబు, రాజగోపాల్‌లు చిరకాల మిత్రులు. వ్యాపార రంగంలో అంచలంచెలుగా ఎదిగారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు కుమార్తె శ్రీ చరితతో రాజగోపాల్ కుమారుడు రాహుల్ వివాహం చేసుకోవడం ఒక ఎత్తు అయితే వివాహం జరిగిన ప్రాంతాల్లో కొత్త రోడ్లు, డివైడర్లును వేసి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు.

# పరిశుభ్రతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించటమే ప్రభుత్వ లక్ష్యం

- స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఓ తేజోష్ణ



**స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీలో ఎంపిడిఓ తేజోష్ణ.**

పామిడి, మే 17 ప్రభాతవార్త

రాష్ట్రంలో పరిశుభ్రతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండలంలో వివిధ గ్రామపంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించగా పామిడి గ్రామపంచాయతీలో ఎంపిడిఓ తేజోష్ణ వేడిని తట్టుకోండి అనే థీమ్‌పై అవగాహణ కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితాలను కొనసాగించవచ్చని అందువల్ల స్వచ్ఛతకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం ముందుకెళ్తున్న తరుణంలో ప్రతిమనిషి వేసవికాలం తగినంత మంచినీటిని సేవించాలని, తమ తమ ప్రాంతాల్లో పశువులు, పక్షులకు మంచినీటిని అందుబాటులో ఉంచాలని, మొక్కలు నాటుతూ వాటిని పరిరక్షించాలని సూచించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో మనందరం బాగస్వాములు అవ్వాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. అంతకుముందు పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించిన ఎంపిడిఓ తేజోష్ణ అంబేద్కర్ సర్కిల్ నందు స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ, సచివాలయ, ఉపాధిహామి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా దృక్పదం మా లక్ష్యం

- గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా
- నిట్టూరు నిలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



**విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా.**

పామిడి, మే 17 ప్రభాతవార్త

సేవా దృక్పదం మా లక్ష్యం అని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా పేర్కొన్నారు. పామిడిలోని నిట్టూరు నిలయం (శ్రీసరస్వతీ విద్యామందిరం) తరగతి గధుల నిర్మాణానికి శనివారం గుంతకల్లు ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా తన సోదరుడు కొట్రికె శ్రీహరిగుప్తాతో కలిసి రూ.5 లక్షల విరాళాన్ని (చెక్కును) అందజేశారు. ఈసందర్భంగా కొట్రికె మధసూదన్‌గుప్తా మాట్లాడుతూ విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. సంపాదించిన దానిలో కొంత సేవా కార్యక్రమాలు, నిరుపేదల అభ్యున్నతికి వినియోగిస్తే మానవజన్మ దన్యం అవుతుందని ప్రజాసేవ చేయటం ద్వార పుణ్యఫలం సిద్దిస్తుందని తద్వార పరమాత్ముని కృప లభిస్తుందని తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యశించి ఒక ఉన్నతమైన లక్ష్యంతో ముందుకుసాగుతూ సమాజాభివృద్ధిని ఆకాంక్షిస్తూ దేశాభివృద్దిలో తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. నిట్టూరు నిలయం (శ్రీసరస్వతీ విద్యామందిరం) తరగతి గధుల నిర్మాణానికి అడిగిన వెంటనే విరాళాన్ని అందజేసిన మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా ఆయన సోదరుడు కొట్రికె శ్రీహరిగుప్తాలకు కృతజ్ఞతలు తెలియజేసిన అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు బొల్లు శ్రీనివాసరెడ్డి, బి.వి.రత్నమయ్య తదితరులు వారిని ఘనంగా సన్మానించారు.

## జేఎన్టీయూలో డాక్టరేట్ అందుకున్న లారెస్ ల్యాబ్ అధినేత సత్యనారాయణ చావాకు ఎమ్మెల్యే దగ్గుపాటి శుభాకాంక్షలు




లారెస్ ల్యాబ్ అధినేత సత్యనారాయణ చావాకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న ప్రముఖ పారిశ్రామిక వేత్త, లారస్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణ చావాకు అర్బన్ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి ఛాన్సిలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. జేఎన్టీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా లారస్ ల్యాబ్స్ అధినేత డాక్టర్ సత్యనారాయణ చావా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ని ప్రత్యేకంగా కలిశారు. లారస్ ల్యాబ్స్‌తో పాటు పారిశ్రామిక వేత్తగా సత్య నారాయణచావా అనేక సేవలందించారని కొనియాడారు. ఆయనందించిన సేవలకు అనంతపురం జేఎన్టీయూ తగిన గుర్తింపునిచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. డాక్టరేట్ అందుకున్న తర్వాత ఆయన్ని కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతపురం వంటి ప్రాంతంలో కూడా మీ సేవల్ని విస్తరించాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సత్యనారాయణ చావా సానుకూలంగా స్పందించారు.

## తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను

- కదిరి మున్సిపాలిటీలో సుపరిపాలన అందించడానికి శాయాశక్తుల కృషి చేస్తా...
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే..

**కదిరి, మే 17 ప్రభాతవార్త**

ప్రస్తుతం కదిరి మున్సిపాలిటీలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అందువల్ల ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 19న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గతంలో మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గడానికి మద్దతిచ్చిన వైసిపి కౌన్సిలర్లు కొత్త ఒరవడికి అందరూ కలిసికట్టుగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు తమ వంతు సహకారాలు అందించారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం పురోగమన దిశగా ముందుకు దూసుకుపోతుందన్నారు. వారు అందిస్తున్న సుపారి పాలన కావచ్చు, టిడిపి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కావచ్చు 13 మంది కౌన్సిలర్లు వైసీపిని వీడి టిడిపిలోకి చేయడం ఎంతో శుభ పరిణామం అని కందికుంట హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత పాలకుల హయాంలో మున్సిపాలిటీలోని వార్డులలో ఎలాంటి అభివృద్ధి సంక్షేమాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన వ్యవహరించడం వల్లే అందరూ ఐకమత్యంగా కలిసి వారిని గద్దె దింపడం జరిగిందన్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుతం రాష్ట్రంలో టిడిపి పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి స్థానిక సంస్థల్లో కూడా టిడిపికి చెందిన వారే అధికారంలో ఉంటే అభివృద్ధి మరింత బలోపేతమై అందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని కందికుంట స్పష్టం చేశారు. అంతేకాక తనపై ఎంతో నమ్మకంతోను, విశ్వాసంతోను తన మాటకు కట్టుబడి వైసీపీని వీడి టిడిపిలోకి వచ్చిన కౌన్సిలర్ అందరికీ తన సంపూర్ణ మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. వారికి ఏ సమస్య వచ్చి అర్ధరాత్రి తలుపు తట్టినా వాటి పరిష్కారానికి సిద్ధంగా ఉంటానని కందికుంట హితవు పలికారు.

### ఎమ్మెల్యే కందికుంట సమక్షంలో వైసీపీని వీడి టిడిపికి చేరిన కౌన్సిలర్లు

కదిరి మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యేకందికుంట సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి టిడిపి పార్టీ కండువా కప్పి సాదరంగా టిడిపిలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కదిరి మున్సిపాలిటీలో అభివృద్ధిని కాంక్షించి, గత పాలకుల, ఆగడాలు అన్యాయాలు, భరించలేక వారికి చెక్ పెట్టి టిడిపికి చేరడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకొని వారి సమస్యలను తీర్చి నప్పుడే నిజమైన పాలకులుగా ప్రజల మన్ననలను పొందుతారని కందికుంట పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తికి స్వాగతం పలికిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న పల్లె కుటుంబ సభ్యులు



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఇతరులు

**అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో**

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి పల్లె నివాసానికి విచ్చేశారు. జేఎన్‌టీయూ లో నిర్వహించిన 14 వ స్నాతకోత్సవకార్యక్రమానికి శనివారం అనంతపురం విచ్చేసిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి స్నాతకోత్సవం పూర్తి చేసుకొన్న తరువాత పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నివాసానికి విచ్చేశారు. అక్కడ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి పుష్ప గుచ్ఛం, ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తండ్రి కేరళ మాజీ డిజిపి శంకర్ రెడ్డిని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా పరిచయంచేశారు. ఈ సందర్భంగా మధు మూర్తి మాట్లాడుతూ.. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో తనకు ముందు నుంచి ఉన్న అనుబంధాన్ని అయన ప్రత్యేకంగా గుర్తు చేసారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన తీరు ఎంతో అద్భుతంగా ఉందని కొనియాడారు. మొదటి సారి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శాసన సభలో ఎంతో చక్కగా మాట్లాడిన అంశాలు అయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి మంచి భవిష్యత్ ఉందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, రమేష్ బాబు, మన్మదేశ్వర్ రెడ్డి, శ్రీధర్‌లు ఉన్నారు.

## ప్రయాణికుల భద్రతే మా లక్ష్యం..!

**ఆర్పీఎఫ్ సౌత్ సెంట్రల్ రైల్వే ఐజి.. కుమారి ఆరో మాసింగ్ ఠాగూర్ సూచన...**



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజి.. కుమారి ఆరో మాసింగ్ ఠాగూర్

**ధర్మవరం రూరల్ మే 17 ప్రభాతవార్త**

ప్రయాణికుల భద్రతే మా లక్ష్యము అని ఆర్పీఎఫ్ సౌత్ సెంట్రల్ రైల్వే ఐజి అధికారిని కుమారి ఆరోమాసింగ్ ఠాగూర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ధర్మవరం పట్టణంలోని ఆర్పీఎఫ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఆర్పీఎఫ్ లో నమోదైన కేసుల వివరాలు, వాటి పరిష్కార వివరాలను ఆర్పీఎఫ్ సిఐ నాగేశ్వరరావు ద్వారా అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఆర్పీఎఫ్ మహిళలకు ఏర్పాటు చేసిన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్పీఎఫ్ విభాగంలో మహిళలకు గట్టి భద్రతను ఇవ్వడమే రైల్వే శాఖ యొక్క ముఖ్య లక్ష్యము అని తెలిపారు. అంతేకాకుండా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుఖవంతంగా ప్రయాణం చేయడానికి ఆర్పీఎఫ్ అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రయాణికులు భద్రంగా ప్రయాణం చేయడానికి తగు సూచనలు ఎప్పటికప్పుడు మా అధికారులు ప్రయాణికులకు తెలియజేస్తున్నారని తెలిపారు. తదుపరి వారు రైల్వే పరిసరాలను పరిశీలించారు. శుభ్రత పట్ల అధికారులు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధను ఉంచాలని తెలిపారు. ప్రయాణికుల పద్ధతిపై తీసుకోవలసిన చర్యలు, పాటించాల్సిన విధి విధానాలను వారు తెలియజేశారు. ప్రయాణికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ఉండరాదని, వారి భద్రతే మన విధుల యొక్క లక్ష్యము అని తెలిపారు. అనంతరం ఆర్పీఎఫ్ ఉద్యోగస్తుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని, త్వరలో పరిష్కార దిశలో తాను కృషి చేస్తానని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ కమిషనర్ మురళీకృష్ణ, గుంతకల్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ అనిల్ కుమార్ సింగ్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, ధర్మవరం ఆర్పీఎఫ్ సిఐ నాగేశ్వరరావు, ధర్మవరం ఆర్పీఎఫ్ ఎస్ఐ. రోహిత్ గౌడ్, ఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా పర్యటనలో ప్రభాకర్ చౌదరిని ఆప్యాయంగా పలకరించిన సీఎం చంద్రబాబు

**అనంతపురం,మే 16 ప్రభాతవార్తబ్యూరో**



మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కర్నూలు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శనివారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఓర్వకల్లు విమానాశ్రయంలో కర్నూలు జిల్లా టిడిపి నాయకులు, అధికారులతో కలసి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం ప్రత్యేకంగా ప్రభాకర్ చౌదరి భుజంపై చెయ్యేసి ఆప్యాయంగా పలకరించి, పలు విషయాల గురించి అడిగి తెలుసుకోవడం విశేషం..

## భూతగాదాలతో గంగలకుంటలో ఇద్దరు దారుణ హత్య.. ఒకరి పరిస్థితి ఆందోళనకరం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

**అనంతపురం, మే 17 ప్రభాతవార్త బ్యూరో**

రాప్తాడు మండలం గంగులకుంట క్రాస్ సమీపంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాలమ్మ, నారాయణ రెడ్డి దంపతులు ఇద్దరు శనివారం దారుణ హత్యకు గురయ్యారు. భూ తగాదాల విషయంలో ఈ హత్య జరిగింది. ముత్యాలమ్మ సోదరుడు ప్రతాప్ రెడ్డి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి తీవ్ర విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి అనంతపురం ప్రభుత్వ హాస్పిటల్‌కి వెళ్లి మృతి చెందిన వారికి సంతాపం తెలియజేసి చికిత్స పొందుతున్న ప్రతాప్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా హత్య చేసిన దుండగలను తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వెన్నపూస రవీంద్రా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**-చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉంది**

**-అవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రాకూడదు - ఇళ్లలోనే ఉండాలి-జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**

**అనంతపురం కలెక్టరేట్, మే 17 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

భారీవర్షాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా వుండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం వుందని, ప్రమాదకరంగా ప్రవహిస్తున్న చెరువులు, వాగులు, వంకలను ఎవరు దాటి ప్రయాణించరాదన్నారు. వర్షాల వల్ల ప్రమాదకర రహదారుల్లో కూడా వెళ్లరాదన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రాకూడన్నారు. భారీ వర్షాల వేళ జిల్లాలోని తడకలేరు, పండమేరు, పెన్నా, హగరి (వేదవతి), చిత్రావతి, కూతలేరు, ఉప్పు వంక, తదితర నదులు, వాగులు, వంకలు, పరివాహక ప్రాంతాల పరిధిలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో మొత్తం 146 ట్యాంకులు ఉండగా, అందులో 2,935 కెపాసిటీ కలిగిన నీరు నిలువ ఉంచే అవకాశం ఉందన్నారు. అందులో ఇప్పటికే 20 ట్యాంకులు 100 శాతం నీరు నిల్వ ఉండగా, మరో 20 ట్యాంకులు 75 శాతం నీటితో నిండి ఉన్నాయని, 43 ట్యాంకులు 50 శాతం నీటితో నిండి ఉన్నాయని, మరో 63 ట్యాంకుల్లో 25 శాతం నీరు నిల్వ ఉన్నాయన్నారు. మళ్లీ వర్షాలు వస్తే ఇప్పటికే పూర్తిగా నిండిన 20 ట్యాంకుల పరిధిలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు వస్తే ప్రజలు ఎవరూ బయటికి రాకూడదని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. జిల్లాలోని ఉరవకొండ మండలం బూదగవి చెరువు మరువ పారుతోందని, శనివారానికి సాధారణ స్థితికి చేరుకుంటుందన్నారు. భారీ వర్షాల సమయంలో జిల్లాలో పలు చోట్ల పిడుగులు పడే అవకాశం ఉందని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదని కలెక్టర్ సూచించారు.

## వివాదాస్పద సీఐ తీరుతో అభాస పాలవుతున్న ఎక్సైజ్ శాఖ ప్రతిష్ఠ

**మొదటిపేజి తరువాయి...** పూర్తిస్థాయి విచారణ చేసి, 2 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండడంపై ఎన్ఫోర్స్మెంట్ శాఖ అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు.అ క్రమ మద్యాన్ని అరికట్టాల్సిన అధికారులు ఎందుకు వాటిపై దృష్టి పెట్టలేదో అంత చిక్కని ప్రశ్నగా మారింది. అక్రమ మద్యం సరఫరా దారులతో ఎక్సైజ్ సిఐ కుమ్మక్కై అక్రమ మద్యం సరఫరాకు పూర్తి దారులు తెరిచిందని, ఇందుకు సిబ్బంది సైతం సహకరిస్తున్నారని సమాచారం. కర్ణాటక సరిహద్దు కలిగిన ఎక్సైజ్ స్టేషన్ లో ఉద్యోగి గా బాధ్యతలు నిర్వహించడానికి చాలా మొత్తం ఖర్చు చేసి వచ్చామని కొందరు సిబ్బంది బహిరంగంగా చెబుతుండటం విశేషం. బాధితుడు ఎక్సైజ్ సిఐ హసీనాభాను పై కేసు నమోదుకు ఉపక్రమిస్తున్నట్లు సమాచారం.

**విచారణకు ఆదేశించాం...... నాగ మద్దయ్య , డిప్యూటీ కమిషనర్ , ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ, అనంతపురం జిల్లా. :** కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్లో జరిగిన ఘటన విచారకరం. సదరు ఘటనపై విచారణ అధికారిని నియమించాం. అధికారి ఇచ్చే నివేదిక ఉన్నతాధికారులకు పంపించి సిఐ పై తగు చర్యలు తీసుకుంటాము.



## 65 ఏళ్ల తర్వాత 3 గ్రామాలకు పండగొచ్చింది..

### ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

- శ్రీ నసనకోట దుర్గమాంబకు వైభవంగా బోనాల సమర్పణ
- మూడు గ్రామాల నుంచి బోనాలతో కదిలిన మహిళలు
- 4వ రోజు కూడా జాతర మహోత్సవంలో పాల్గొన్న పరిటాల కుటుంబం



జాతర మహోత్సవంలోని దృశ్యాలు, పాల్గొన్న పరిటాల కుటుంబం సభ్యులు







**రామగిరి, మే 17 ప్రభాతవార్త**


65 ఏళ్ల తర్వాత శ్రీ దుర్గమాంబ జాతరతో 3 గ్రామాలకు పండుగ వచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలంలోని నసనకోట దుర్గమాంబ జాతర మహోత్సవాల్లో నాల్గవ రోజు బోనాల సమర్పణ వైభవంగా సాగింది. మూడు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో అమ్మవారి క్షేత్రం ఒక జనసంద్రన్ని తలపించింది. నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తమ ఇంటి నుంచి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చారు. మూడు గ్రామాల ప్రజలు ఒకచోట కలవడంతో ఒక సందడి వాతావరణం కనిపించింది. ఎంతో భక్తి శ్రద్ధలతో మహిళలు దుర్గమాంబను కొలుస్తూ బోనాలు సమర్పించారు. నాల్గవరోజు కార్యక్రమాల్లోకూడా రాప్తాడుఎమ్మెల్యే పరిటాలసునీతతోపాటు ఆమె కుటుంబ సభ్యులు, టిడిపినాయకులు పాల్గొన్నారు. పరిటాల కుటుంబం నుంచి ఎమ్మెల్యే సునీత కుమార్తె స్నేహలత అమ్మవారికి బోనం సమర్పించారు. అంతకు ముందు ఉదయం జాతర మహోత్సవంలో భాగంగా అభయాంజనేయస్వామి విగ్రహానికి 108 విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. కలశాలతో విశేష అభిషేకం, పంచామృత అభిషేకం, పంచసూక్తాది అభిషేకం, సహస్రక్షీర ఘటాభిషేకం, శతసిద్ర అభిషేకం, గోశృంగార అభిషేకంతోపాటు పూర్ణహారతి కార్యక్రమాలు అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం రోజు జరిగే కార్యక్రమంతో జాతర మహోత్సవం ముగియనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపరిటాల సునీత మాట్లాడుతూ.. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడ జాతర మహోత్సవం జరిగినట్లు గ్రామపెద్దలు చెబుతుంటారన్నారు. అయితే చాలామంది ఆ జాతరను చూడలేదన్నారు. అందుకే తాను ఎమ్మెల్యే అయ్యాక జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. 5రోజులపాటు జరుగుతున్న ఈ ఉత్సవాలకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రేపటితో ఈ జాతర మహోత్సవం ముగుస్తుందని ఆమె అన్నారు. నసనకోట నుంచి ముత్యాలమ్మ, దుర్గమ్మ, వెంకటాపురం నుంచి ఎల్లమ్మ, గంగంపల్లి నుంచి గంగమ్మ, హరియనచెరువు నుంచి పోతరాజులు ఇలా ఐదు మంది దేవతలకు ఇక్కడ విశేష పూజలు జరిగాయన్నారు. 80 ఏళ్ల క్రితం నాటి శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠను కూడా చేసినట్లు వివరించారు. ఐదు గ్రామాల ప్రజలు తమ ఆడపడుచులను బంధువులను ఇంటికి పిలిచి ఘనంగా ఈ జాతర మహోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. దుర్గమ్మక్షేత్రానికి అన్ని సౌకర్యాలు ఉండాలన్న ఉద్దేశంతో ఇక్కడ కోటి30లక్షల రూపాయలతో అభివృద్ధి పనులుకూడా చేపట్టినట్లు పరిటాల సునీత వివరించారు. నేడు (ఆదివారం) రోజు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ..హరిహర రాయలు, బుక్కరాయల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందన్నారు. ఇక్కడ శాసనాల ద్వారా ఈ ప్రాంత చరిత్రను వివరించారన్నారు. 65 ఏళ్లుగా జాతర జరగకపోవడంతో రెండు తరాల ప్రజలకు ఈ ఆలయ విశిష్టత తెలియకుండా పోయిందన్నారు. 1278లో ఈ ఆలయాన్ని నిర్మించారంటే ఇక్కడ దుర్గమ్మ అమ్మవారిని అంతకు మునుపే ప్రతిష్ట జరిగి ఉంటుందన్నారు. ఇక్కడ ఈ ప్రాంత ప్రజలతో పాటు బయట ప్రపంచానికి ఈ ఆలయ విశిష్ట తెలిపే విధంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## పరిశుభ్రత అన్నది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి, ఎమ్మెల్యే,ఎంపీ

**నారాయణపురంలో స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ.**



పంచాయతీ కార్యాలయం ఎదూరు గా మొక్కలు నాటుతున్న దృశ్యం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.

**అనంతపురం రూరల్, మే 17 ప్రభాతవార్త :**

గత ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యవస్థలన్నింటినీ నర్వనాశనం చేశారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శ చేశారు. శనివారం అనంత రూరల్ మండలం ఏ.నారాయణపురం పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరిశుభ్రతపై అవగాహన కల్పించి అనంతరం పంచాయతీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఇల్లు శుభ్రంగా ఉంటే.. వీధి శుభ్రంగా ఉంటుందని.. వీధి శుభ్రంగా ఉంటే ఊరు శుభ్రంగా ఉంటుందని.. ఊరు శుభ్రంగా ఉంటే రాష్ట్రం శుభ్రంగా ఉంటుందని.. రాష్ట్రం బాగుంటే దేశం బాగుంటుందన్నారు.ఇదే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణ ఆంధ్రస్వచంద్ర కార్యక్రమాన్ని తీసుకొచ్చరన్నారు.గత ఐదేళ్లలో గ్రామాల్లో ఒక డ్రైన్ క్లీన్ చేసిన పాపాన పోలేదని.. వీధిలైట్లు పోతే వాటిని కూడా మార్చలేదన్నారు. 2014 నుంచి 19మధ్య కాలంలో మంత్రి నారా లోకేష్ ప్రతి విద్యుత్ పోల్ కి ఎల్ఈడి లైట్ ఉండేలా చేశారన్నారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఈ పది నెలల కాలంలోనే 35 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామన్నారు. ఈ ఏడాదిలో 100 కోట్లతో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డి వెంకటనాయుడు, స్పెషల్ ఆఫీసర్ సురేష్, పంచాయితి కార్యదర్శి ప్రవీణ్ బాబు, సచివాలయ కార్యదర్శిలు మహేంద్రరెడ్డి,బాలచంద్రారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఓబులపతి, టిడిపి నాయకులు రఘు, మాధవి, అశ్విని, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, టిడిపి మైనార్టీ నాయకుడు సైఫుద్దీన్, సచివాలయ ఉద్యోగులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా..**

## తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



జాతీయ జెండాను చేతబూని ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, మే 17 ప్రభాతవార్త**

ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా పూర్తి చేసిన త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా అనంతపురం పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో జిల్లా అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, తదితరులతో శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ..పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా, దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన మన సైనికులకు సంఘీభావం తెలపడం కోసం మన అనంతపురములో అందరి సహకారంతో ఈ తిరంగా యాత్రను నిర్వహించామని తెలిపారు. మన జాతీయ జెండా గౌరవాన్ని మరింత ఇనుమడింపు చేసేలా, మన దేశ సమైక్యత, సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్ర ర్యాలీ ప్రజలలో దేశభక్తిని పెంపొందించడమే కాకుండా మన త్రివిధ దళాల సైనికుల పట్ల మన రుణం తీర్చుకునేలా నిలుస్తుందన్నారు.